సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 7 । నవంబర్ । 2023



వైభవంగా నిత్య కల్యాణం

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యకల్యాణం సోమవారం విశేషంగా జరిగింది. IIలో



అలరించిన సాంస్కృతిక పోటీలు

రాంబిల్లిలో గిరిజన సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. IIలో




స్పందనకు 42 అర్జీలు

రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 42 వినతులు స్వీకరించారు. IIలో

న్యూస్‌రీల్

ఓటు తొలగింపు అవాస్తవం



ఓటరు జాబితాలో నమోదైన వంతల నాగేశ్వరరావు పేరు

- ఈనాడు అసత్య కథనం
- తహసీల్దార్ నాగమ్మ

డుంబ్రిగుడ: టీడీపీ అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు ఓటు తొలగించారని ఈనాడులో సోమవారం ప్రచురితమైన కథనం అవాస్తవమని తహసీల్దార్ నాగమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాను సక్రమంగా పరిశీలించకుండా అవాస్తవ సమాచారంతో కథనం ప్రచురించారని పేర్కొన్నారు. పోలింగ్‌కేంద్రం నంబరు 200లో వరుస సంఖ్య 446లో వంతల నాగేశ్వరరావు (తండ్రి సద్దు) అని నమోదై ఉన్నారు. వాస్తవాలకు విరుద్ధంగా ప్రచురించిన కథనాన్ని ఖండిస్తున్నామని ఆమె తెలిపారు.

నాలుగు ప్రైవేట్ క్లినిక్‌ల సీజ్

చింతూరు: కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశాల మేరకు సోమవారం చింతూరు, ఎటపాక మండలాల్లో తనిఖీలు నిర్వహించి నాలుగు ప్రైవేటు క్లినిక్‌లను సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. ఇప్పటివరకు చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో 27 ప్రైవేటు క్లినిక్‌లను సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో చింతూరు తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎటపాక తహసీల్దార్ పృథ్వీ, డాక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలిక మృతి

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న చిట్టోజి అనూష (11) అనారోగ్యం కారణంగా కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఇందుకు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీహేన్సన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దసరా సెలవులకు అడ్డతీగలలో ఇంటికి వెళ్లిందని, అప్పటి నుంచి పాఠశాలకు రాలేదన్నారు. ఇంటి వద్ద ఉంటుండగా ఆమె అనారోగ్యానికి గురవడంతో తల్లిదండ్రులు గత వారం అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారని ఆమె పేర్కొన్నారు. అక్కడి నుంచి రాజమండ్రి, కాకినాడ తరలించారన్నారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందడం బాధాకరమని హెచ్‌ఎం తెలిపారు. సోమవారం హెచ్‌ఎం ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అడ్డతీగలలో అనూష ఇంటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు.

కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

పాడేరు రూరల్ : జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ సాధికారత కార్యాలయంలో మిషన్ వాత్సల్య కింద వివిధ కేటగిరిల్లో మంజూరైన పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్, జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ విభాగంలో 11 పోస్టులు, ప్రత్యేక దత్తత విభాగంలో 11 పోస్టులు కేటాయించారన్నారు. అభ్యర్థులు జూలై ఒకటవ తేదీ నాటికి 25 ఏళ్ల నుంచి 42 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అనుభవం, విద్యార్హతలు, ఇతర వివరాలు హెచ్‌టీటీపీ:// అల్లూరిసీతారామరాజు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో ఉన్నాయన్నారు. దీనినుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన ధ్రువపత్రాలతో ఈనెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా అందజేయాలన్నారు. పాడేరు తలారిసింగిలోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయం పనివేళల్లో నేరుగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా అందజేయాలని ఆయన సూచించారు.

బాలుడు అదృశ్యం



మోహనరావు

గూడెంకొత్తవీధి: గాలికొండ పంచాయతీ అకులూరుకు చెందిన వంతల మోహన్‌రావు(7) నాలుగు రోజుల నుంచి కనిపించడం లేదని తండ్రి సుబ్బారావు సోమవారం విలేకరులకు తెలిపారు. గురువారం ఇంటి నుంచి ముంచంగిపుట్టు మండలం కిలగడ టీడబ్ల్యూ పాఠశాలకు బయలుదేరి వెళ్లాడని ఆయన పేర్కొన్నారు. అయితే పాఠశాలకు రాలేదని అక్కడ ఉపాధ్యాయుల నుంచి సమాచారం రావడంతో బంధువులు అందరి ఇళ్ల వద్ద వెతికామని తెలిపారు. అయినా అతని ఆచూకీ తెలియలేదన్నారు. తమ కుమారుడి ఆచూకీ తెలిసిన వారు 9441721571, 9481017112, 8019502649 నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు.

దళారుల దోపిడీకి చెక్

మన్యంలో కాఫీ రైతులకు గిరిజన సహకార సంస్థ బాసటగా నిలుస్తోంది. వారికి గిట్టుబాటు అయ్యేలా ధర చెల్లించడమే కాకుండా దళారి వ్యవస్థకు చెక్ పెట్టింది. కాఫీ ఆర్థిక ప్రగతికి దోహదపడుతోంది. ఈ ఏడాది కూడా రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు కార్యాచరణ రూపొందించింది.

- కాఫీ రైతుల ఆర్థిక ప్రగతికి బాటలు
- కార్యాచరణ రూపొందించిన గిరిజన సహకార సంస్థ
- గిట్టుబాటు అయ్యేలా ధరల నిర్ణయం
- నేరుగా గ్రామాలకు వెళ్లి కొనుగోలుకు ఏర్పాట్లు



కాఫీ పండ్ల సేకరణలో నిమగ్నమైన గిరి రైతులు

సాక్షి,పాడేరు: మన్యంలో కాఫీ సాగు చేసే రైతులను ప్రభుత్వం గత రెండేళ్లుగా ఆదుకుంటోంది. గిరిజన సహకార సంస్థ ద్వారా కాఫీ గింజల కొనుగోళ్లను చేపడుతోంది. బెంగళూరులోని అంతర్జాతీయ కాఫీ మార్కెట్లో ధరలకు తగ్గట్టుగానే నగదు చెల్లిస్తోంది.

దళారులకు అడ్డుకట్ట..

కాఫీ రైతుల నుంచి పార్చ్‌మెంట్ గింజలను కిలో రూ.100 నుంచి రూ.120 ధరకు మించి వ్యాపారులు కొనుగోలు చేసేవారు కాదు. మైదాన, స్థానిక వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గించేయడంతో గిరి రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. దళారి వ్యాపారుల తప్పుడు తూకం, తక్కువ ధరలతో మోసపోతున్న కాఫీ రైతులను ఆబెడద నుంచి కాపాడే లక్ష్యంగా ప్రభుత్వం జీసీసీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టింది. దీంతో గతేడాది ఆ సంస్థకు అమ్ముకున్న కాఫీ రైతులంతా మంచి లాభాలు పొందారు.

కాఫీ మార్కెట్లో పోటీగా..

గత ఏడాది కాఫీ గింజల సీజన్ ప్రారంభంలోనే పార్చ్‌మెంట్‌ను కిలో రూ.270, చెర్రీ రకాన్ని కిలో రూ.135కు ప్రభుత్వం కొనుగోలు చేసింది. కాఫీ మార్కెట్‌లో జీసీసీ పోటీగా నిలబడడంతో వ్యాపారులు కూడా చివరకు ఆదే ధర చెల్లించాల్సి వచ్చింది. చివరిలో పార్చ్‌మెంట్ కాఫీ గింజలకు కిలో రూ.285, చెర్రికి రూ.145కు పెంచింది. గిరి రైతుల నుంచి 480 టన్నుల పార్చ్‌మెంట్, 520 టన్నుల చెర్రీ కలిపి వెయ్యి టన్నుల కాఫీ గింజలను పాడేరు డివిజన్ వ్యాప్తంగా జీసీసీ కొనుగోలు చేసింది.

ప్రైవేట్ సంస్థలు..

పాడేరు ఐటీడీఏతో పాటు పలు ప్రైవేట్ సంస్థలు కూడా కాఫీపండ్లను కొనుగోలు చేసేందుకు సిద్ధపడ్డాయి. ఈనేపథ్యంలో రైతులు సేకరించిన కాఫీ పండ్లను నేరుగా అమ్ముకుండా పల్పింగ్ చేసి పార్చ్‌మెంట్ కాఫీని విక్రయించేందుకు గింజలను తయారు చేస్తున్నారు. ఆయా గ్రామాలపై దృష్టిపెట్టిన జీసీసీ ఈ ఏడాది 1500 టన్నుల కాఫీ గింజలను కొనుగోలు చేసే లక్ష్యంతో ఉంది. జీసీసీ అధికారులు,సిబ్బంది తూకం యంత్రాలు, వాహనాలతో నేరుగా గ్రామాలకే వెళ్లి పార్చ్‌మెంట్, చెర్రి రకం కాఫీ గింజల కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముందుగానే ధరల ప్రకటన

జీసీసీ ఈఏడాది కూడా ముందస్తుగానే కాఫీ గింజల కొనుగోలు ధరలను ప్రకటించింది. పార్చ్‌మెంట్ కిలో రూ.280, చెర్రీ కిలో రూ.145కు కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించడంతో దళారుల్లో గుబులు నెలకొంది. పాడేరు డివిజన్‌లో 1.56 లక్షల ఎకరాల్లో కాఫీ ఫలసాయం వస్తుండగా గతేడాది 15 వేల టన్నుల కాఫీ గింజల దిగుబడి సాధించారు. అయితే ఈఏడాది కాఫీతోటలు విరగ్గాయడంతో గిరి రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందని ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆత్మబంధువులా..

- **రోగులను ఆప్యాయంగా పలకరించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ**
- **స్వయంగా** దగ్గరుండి వైద్య పరీక్షలు
- **చిరుధాన్యాలతో** ఆహారం తీసుకోవాలని సూచన



బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయ టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విచ్చేసిన రోగులను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆత్మబంధువులా పలకరించారు. వారిని ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలను తెలుసుకున్నారు. స్వయంగా ఆయన దగ్గరుండి వారికి వైద్య పరీక్షలు జరిపించారు. మందులు అందజేశారు. సోమవారం ఆయన ఉదయం అరకువేలీనుంచి ఇంటి నుంచి 11.40కు బయలుదేరారు.

మధ్యాహ్నం 12.10 నుంచి 1.30 వరకు..

డుంబ్రిగుడ మండలం అరమ పంచాయతీ నందివలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని 12.10కి సందర్శించారు. రోగులు, వృద్ధులతో మాట్లాడి కష్ట సుఖాలు తెలుసుకున్నారు. జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరం బ్రోచర్‌ను వారికి చూపించి ఈ కార్యక్రమం ప్రయోజనాలను వివరించారు. స్థానికంగా వైద్యశిబిరం ఏర్పాటుచేయడం వల్ల అవస్థలు తప్పాయని వారంతా సంతోషంతో చెప్పారు. రోగులను దగ్గరుండి వైద్యులకు చూపించారు. గర్భిణులు, బాలింతలకు ఏర్పాటుచేసిన కౌంటర్ వద్దకు వెళ్లి వాళ్ల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వైద్యులకు సూచనలిచ్చారు. బాలింతలతో మాట్లాడుతూ ఇద్దరు పిల్లలు ముద్దు, ముగ్గురు పిల్లలు వద్దు అని సూచించారు. అంగన్ వాడీ సిబ్బంది ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారం ఎంతో శ్రేయస్కరమని, వాటిలో పోషకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. జలుబు, దగ్గుతో ఇబ్బందులు పడుతున్న ఆయన వైద్యపరీక్షలు చేయించుకున్నారు. మధ్యాహ్నం 1.30 వరకు అక్కడే ఉండి వైద్యసేవలను పర్యవేక్షించారు.గ్రామాల్లోని ప్రతీ కుటుంబాన్ని సర్వే చేసి గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పేర్కొన్నారు.

437 మందికి వైద్యసేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 437 మంది వైద్యసేవలు పొందారు. వీరిలో 11 మందికి విశాఖ కేజీహెచ్‌కు, 26 మందికి పాడేరు జిల్లా ఆస్పత్రికి, తొమ్మిది మందికి అరకులోయ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. వైద్యులు ప్రేమ, నజీప్, కరుణ, భాను రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి, డుంబ్రిగుడ, పెదబయలు జెడ్పీటీసీలు జానకమ్మ, బొంజుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత, ఎంపీటీసీ పద్మ, సర్పంచ్ ముల్లా, మండల మహిళా అధ్యక్షురాలు బంగురు శాంతి, నాయకులు గణపతిరావు, జగ్గునాయుడు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

విద్యాప్రమాణాల మెరుగుపై దృష్టి పెట్టండి





మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, హాజరైన ఎంఈవోలు, హెచ్‌ఎంలు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.విద్యా ప్రమాణాలపై ప్రేరణ ఆధ్వర్యంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండలాల ప్రాథమిక పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో నిర్వహించిన సర్వేపై సోమవారం కలెక్టరేట్‌లో ఎంఈవో, హెచ్‌ఎంలకు సోమవారం ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పఠనా సామర్థ్యంలో వెనుకబడి ఉంటున్నారని గుర్తించినట్టు చెప్పారు. దీనిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ప్రాథమిక స్థాయిలో సక్రమంగా బోధిస్తే మధ్యలో బడి మానరని అన్నారు. తెలుగు, ఆంగ్ల భాష, చరిత్ర, సంస్కృతి, గణితం బోధించాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహ పూర్వక వాతావరణం ఉంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కేజీబీవీ పాఠశాలలో విద్యా ప్రమాణాలను సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో గౌరీ శంకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండల రావు, ప్రేరణ ప్రోగ్రాం మేనేజర్ జి.నారాయణరావు, ఎంఈవోలు రామచంద్రరావు, సరస్వతి పాల్గొన్నారు.

గొంతు నొప్పితో చిన్నారి మృతి



వైష్ణవి (ఫైల్)

అరకులోయ రూరల్: మండలంలో మారుమూల బస్కి గ్రామానికి చెందిన వంతల వైష్ణవి (7) సోమవారం మృతి చెందింది. కొద్దిరోజులుగా గొంతు నొప్పితో బాధపడుతున్న ఆమెను గత నెల 27వ తేదీన అరకులోయ ఏరియా ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందిన తరువాత ఈనెల 5వ తేదీన ఇంటికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె ఆరోగ్యం విషమించడంతో ఇంటివద్దనే మృతి చెందినట్టు తండ్రి దామోదర్, కుటుంబ సభ్యులు తెలిపారు.

వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి

బస్కి పంచాయతీ కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామరావు కోరారు. గతంలో కూడా గొంతు నొప్పి లక్షణాలతో ఇద్దరు చిన్నారులు మృతి చెందరన్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తగు వైద్య సేవలందించాలని ఆయన కోరారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- అంగన్‌వాడీ భవనాల ప్రారంభం



అరకులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ టౌన్: మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. సోమవారం అరకులోయ నియోజకవర్గం పరిధిలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలకు సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన మహిళలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రతీ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ అనంతగిరి మండలంలో మూడు, అరకులోయ మండలంలో రెండు, హుకుంపేట మండలంలో మూడు,పెదబయలు మండలంలో నాలుగు, ముంచంగిపుట్టు మండలంలో ఒకటి చొప్పున అంగన్‌వాడీ భవనాలు నిర్మించామన్నారు. పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 35 భవనాల నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 25 భవనాలు ప్రారంభించామని, మరో పది భవనాలు త్వరలో ప్రారంభిస్తామన్నారు.టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాల్, తహసీల్దార్ వేణుగోపాల్, సీడీపీవో శారద, ఏఈఈ అభిషేక్, ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, ఎంపీటీసీ భీమరాజు, ఆపంథ్ కుమార్ పాల్గొన్నారు.

మోదమ్మ ఆలయ అభివృద్ధికి సహకారం

ఎంపీ మాధవికి విన్నవించిన కమిటీ ప్రతినిధులు



ఎంపీ మాధవికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సింహాచలం నాయుడు

పాడేరు రూరల్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందించాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం విశాఖపట్నంలో ఆమె ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. పాడేరు పట్టణంలోని పలు సమస్యలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, పర్యాటక ప్రదేశాలు, హిందూ శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కుర్తాడ రామారావు, ఉప్పెల వెంకటరత్నం, బాలన్న, కొట్టగుళ్లి పోతురాజు పాల్గొన్నారు.

రిఫర్ కేసులపై దృష్టి పెట్టండి

కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరాల్లో మెరుగైన చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేసిన కేసుల పరిస్థితిపై దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, వైద్యాధికారులు, సీడీపీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 287 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించి, 1,57,137 మందిని పరీక్షించినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. వీరిలో సుమారు తొమ్మిది వేల మందిని మెరుగైన చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేసినట్టు చెప్పారు. ఆయా ఆస్పత్రుల్లో ఎంతమందికి చికిత్స అందించలగరన్న సమాచారం సేకరించి అందుకు తగ్గట్టుగా రిఫర్ చేసిన రోగులను పంపించాలని, వారిని అనవసరంగా తిప్పించవద్దని ఆదేశించారు. చికిత్స అనంతరం కూడా వారికి అవసరమైన మందులు అందుతున్నది లేనిదీ పరిశీలించాలని సూచించారు. కంటి వెలుగు పథకంలో 19,138 మందికి స్క్రీనింగ్ చేశారని, వీరిలో అవసరమైన వారికి కేటరాక్ట్ చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాల్లో హైపర్‌టెన్షన్ కేసులు 6,336, రక్తహీనతతో బాధపడుతున్న 1435 మందిని గుర్తించినట్టు చెప్పారు. మరో 1262 మంది డయాబెటిస్ రోగులను గుర్తించారని, వీరందరికీ తగు చికిత్స అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఎంపీడీవోల పర్యవేక్షణలో ఆశా, ఏఎన్‌ఎం, మహిళా పోలీసుల సహకారంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ ప్రక్రియ 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రక్తహీనతతో ఏఒక్క విద్యార్థి మృతి చెందకూడదని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా క్షయ నియంత్రణాధికారి విశ్వేశ్వర నాయుడు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాధన, డీటీటీ ప్రాజెక్ట్ అధికారి భారతీదేవి, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

భూముల రీసర్వే సాహసోపేత నిర్ణయం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- 175 మందికి పట్టాల పంపిణీ
- గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే భవనాల ప్రారంభం



వెలగలపాలెంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పట్టాలు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీపీ, తహసీల్దార్ తదితరులు

కొయ్యూరు: భూముల రీసర్వే చేయించడం తమ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయమని ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె డౌనూరు గ్రామసచివాలయం పరిధిలోని మూలపేట, డౌనూరుకు చెందిన 175 మందికి జగనన్న భూశాశ్వత హక్కు, భూరక్ష పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సరిహద్దు వివాదాలు లేకుండా ఉండేందుకు ఈ సర్వే తోడ్పడుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు సర్వేకు సహకరించాలన్నారు. ఇంతవరకు ఏ ప్రభుత్వం ఇవ్వలేని విధంగా ఏళ్ల తరబడి సాగు చేస్తున్న వారికి ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలను వేల సంఖ్యలో పంపిణీ చేశామన్నారు. తమ ప్రభుత్వం గిరిజన పక్షపాతిగా పాలన అందిస్తోందన్నారు. రీ సర్వే చేసి పట్టాల పంపిణీ చేపట్టిన రెవెన్యూ సిబ్బందిని ఆమె అభినందించారు

సచివాలయ వ్యవస్థతో మార్పులు

గ్రామసచివాలయ వ్యవస్థ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం చిట్టింపాడు, వెలగలపాలెంలో గ్రామ సచివాలయ భవనాలు, నడింపాలెం, వెలగలపాలెంలో రైతు భరోసా కేంద్రాల భవనాలను ఆమె ప్రారంభించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ రాకతో ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఇలాంటి వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదన్నారు. అనేక రాష్ట్రాలు దీనిని ఆదర్శంగా తీసుకునేందుకు చూస్తున్నాయన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ జె రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, గ్రామ సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆర్. మునిలినాయుడు, సర్పంచ్‌లు ఆర్.వెంకటలక్ష్మి, పాట్టిక భవాని, రీముల శ్రీను, ఎంపీటీసీ బి.అప్పారావు, గాడి అచ్చిరాజు, బి. కల్యాణం, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో లాలం సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

42 మంది నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు

దేవీపట్నం : అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడే తమ ప్రభుత్వ లక్ష్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. సోమవారం వారు మండలంలోని ఇందుకూరు పేటలో 42 మంది చిన్నరమణయ్యపేట వాసులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పోలవరం నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పునరావాసం కల్పించామన్నారు. మిగిలిన వారి ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. పట్టదారులు చనిపోతే వారసులకు పట్టాలందిస్తామన్నారు. ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ఇందుకూరుపేటలో వైఎస్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం కాచ్చులూరు, కె. గొందురు, నిర్వాసిత కాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 142 గడపలను వారు సందర్శించి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సిరసం సత్యవేణి పార్టీ నేతలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

గడపగడపకు మన ప్రభుత్వంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పాడేరుఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. వెలగలపాలెం సచివాలయం పరిధిలో కొత్తపాలెం, రావిమానుపాలెం, సీకాయపాలెంలలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆమె 200 గడపలను సందర్శించి, ఆయా గ్రామస్తుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసిందని చెప్పారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. టీడీపీ హయాంలో పేదలకు చెందాల్సిన సొమ్మును ఆపార్టీ నాయకులు స్వాహా చేశారన్నారు. అవినీతికి పాల్పడడం వల్లే చంద్రబాబు ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చిందని చెప్పారు. నాడు ఒక్క గిరిజనుడికైనా పట్టాలు ఇవ్వలేకపోయారని, నేడు అందరికీ పట్టాలు అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా తాగునీరు, మురుగు కాలువల సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా వాటిలో కొన్నింటిని పరిష్కరించారు. మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, శరభన్నపాలెం ఎంపీటీసీ సోమా గాంధీ, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలు, అప్పన వెంకటరమణ, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు జి.మహేష్, మండల అధ్యక్షుడు జె.బాబులు, ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు, కొర్రా తిరుపతి, ఎంపీటీసీ మల్లేశ్వరి, సర్పంచ్‌లు చందు, మహిళా విభాగం నేత సావిత్రి, సర్పంచ్‌లు భవానీ, వెంకటలక్ష్మి, రాజకుమారి, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, నేతలు గంగాధర్, త్రిమూర్తులు, గాంధీ, శేఖర్, గాడి అచ్చిరాజు, అధికారులు పాల్గొన్నారు.


లబ్ధిదారునికి బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ఎయిర్‌పోర్టుకు కొత్త రూపు


కార్ పార్కింగ్ వరకు విస్తరించనున్న కనోపి ఇదే..


అరైవల్, డిపాచర్ వాహనాలు వెళ్లే రోడ్లు నిర్మాణం ఇక్కడ నుంచే..

- విమానాశ్రయ ప్రాంగణంలో మార్పులు
- వచ్చేవారికి, వెళ్లేవారికి వేర్వేరు మార్గాలు
- ప్రస్తుత మూడు లైన్లు ఏడు లైన్లుగా విస్తరణ
- ఇందుకోసం రూ.20 కోట్ల వ్యయం
- వచ్చే నెలలో టెండర్లు, ఫిబ్రవరిలో పనులు మొదలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త రూపును సంతరించుకోనుంది. ఈ ప్రాంగణం మరిన్ని సొబగులతో ఎంతో సుందరంగా మారనుంది. ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా మార్పులు, చేర్పులతో పాటు రోడ్ల విస్తరణకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించిన వాహనాలు ప్రయాణికులను దించడం, ఎక్కించుకోవడం జరుగుతోంది. అనంతరం అక్కడ నుంచి అదే మార్గంలో ముందుకు వెళ్లి కుడి వైపు తిరిగి హైవేపైకి వెళ్తున్నాయి. ఇకపై అలా కాకుండా అరైవల్, డిపాచర్ ప్రయాణికుల వాహనాలు వేర్వేరుగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విమానాల్లో వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికుల వాహనాలు, ఇతర వాహనాలు అరైవల్ పాయింట్ ఎదురుగా నేరుగా వెళ్లిపోయేలా రోడ్డును నిర్మిస్తారు. అలాగే విమానాల్లో వచ్చిన ప్రయాణికులు డిపాచర్ పాయింట్ ఎదురు నుంచే వెళ్లేలా మరో రోడ్డును నిర్మించనున్నారు. దీంతో విమాన ప్రయాణికుల వాహనాలు మునుపటిలా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉండదన్న మాట! ఇలా అరైవల్‌కు ఒకటి, డిపాచర్ ప్రయాణికులకు మరొకటి విడివిడిగా ప్రత్యేక రోడ్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానం చేస్తారు.

మూడు లైన్లు ఇక ఏడు

విశాఖపట్నం విమానాశ్రయానికి రానురాను ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. కోవిడ్‌కు ముందు ఏటా 2.85 మిలియన్ల మంది ఈ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించేవారు. కోవిడ్ ప్రభావంతో ఆ తర్వాత విమాన సర్వీసులతో పాటు ప్రయాణికుల సంఖ్య కూడా క్షీణించింది. మళ్లీ ఈ ఏడాది నుంచి కోవిడ్‌కు ముందు పరిస్థితికి చేరుకుంటోంది. ఫలితంగా ప్రయాణికుల రద్దీ ఊపందుకుంది. ప్రస్తుతం ఈ విమానాశ్రయం ప్రాంగణంలో మూడు రోడ్లు ఉన్నాయి. ముమ్మందు ప్రయాణికుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఇకపై వీటిని ఏడు రోడ్లుగా విస్తరించనున్నారు. దీని వల్ల ఎయిర్‌పోర్టులోకి వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుంది. పైగా ట్రాఫిక్ సమస్య తలెత్తదు.

కనోపీల విస్తరణ కూడా..

మరోవైపు ఎయిర్‌పోర్టుకు ఆనుకుని ఎదురుగా అటూ, ఇటూ కనోపీలున్నాయి. వీటిలో ఇప్పుడు కార్ పార్కింగ్ వైపు ఉన్న కనోపీని చివరి వరకు విస్తరించనున్నారు. దీనివల్ల ఫుట్‌పాత్ నుంచి ఎయిర్‌పోర్టు బిల్డింగులోకి వెళ్లే ప్రయాణికులు వర్షాలకు తడిసిపోయే వీలుండదు. వీటితో పాటు ఈ విమానాశ్రయంలో సైనేజి బోర్డులు కూడా ఏర్పాటు చేస్తారు. వీటన్నిటికి రూ.20 కోట్లు వెచ్చించనున్నారు. ఇలా రోడ్లు, కనోపీల విస్తరణ, సైనేజి బోర్డుల ఏర్పాటు వంటి వాటితో విశాఖ విమానాశ్రయం మరింత శోభాయమానంగా మారనుంది.

డిసెంబరులో టెండర్లు



విశాఖ విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా వారికి మరిన్ని సౌకర్యాలు పెంచేలా చూస్తున్నాం. ఇందుకనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఈ ఎయిర్‌పోర్టులో రూ.20 కోట్లతో చేపట్టబోయే పనులకు ప్రణాళిక సిద్ధమైంది. డిసెంబరులో టెండర్లను పిలుస్తారు. టెండర్లు ఖరారయ్యాక ఫిబ్రవరిలో పనులు మొదలు పెడతారు. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తారు.

– ఎస్.రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖ విమానాశ్రయం

స్పందనకు 42 అర్జీలు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల నుంచి 42 అర్జీలు స్వీకరించారు. వై.రామవరం ఎగువ ప్రాంతంలోని కొండరెడ్డి గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక అధికారిని నియమించాలని, పీటీజీ గిరిజనులకు 35 కిలోల బియ్యం ప్రతినెలా అందజేయాలని మంగంపాడు గిరిజనులు సరం అబ్బాయిరెడ్డి, నైని పండయ్య కోరారు. గ్రామంలో నిలిచిపోయిన పీహెచ్‌సీ భవనాన్ని పూర్తి చేయడమే కాకుండా పాలగెడ్డ నుంచి తులసూరు గ్రామానికి కొత్త రోడ్డు నిర్మించాలని వారు అధికారులను కోరారు. రంపచోడవరం మండలం వేములకొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా మరో ఉపాధ్యాయుడిని నియమించాలని ఆ గ్రామానికి చెందిన నూకలేటి అక్కమ్మ, రేవుల లక్ష్మి, సాధన ప్రతాప్ రెడ్డి కోరారు. వీటితోపాటు పలువురు వ్యక్తిగత సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. స్పందనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం


అంబులెన్స్‌లోని ప్రసవించిన మహిళ

సీలేరు: ఏపీ జెన్‌కో భవ్య ఆస్పత్రి అంబులెన్స్‌లో ఓగిరిజన మహిళ సోమవారం ప్రసవించింది. సిబ్బంది అందించిన వివరాలు.. మండలంలోని రష్యాగూడ గ్రామానికి చెందిన రాధమ్మ అనే గర్భిణికి సోమవారం పురిటి నొప్పులు రావడంతో ఆమె భర్త కొండబాబు సీఏస్ఆర్ అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బందిగ్రామానికి వెళ్లి వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికమై ప్రసవించింది. తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలించిగా, వైద్య సిబ్బంది చికిత్స చేశారు. తల్లీబిడ్డలకు సకాలంలో వైద్యసేవలు అందించిన అంబులెన్స్ సిబ్బంది వినాయకుడు, గణేష్‌ను భవ్య ఆస్పత్రి మేనేజర్ తేజ అభినందించారు.

ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ మరియు ఎక్స్ అఫీషియో జాయింటు కలక్టరు
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం.
నోటిఫికేషన్

తేది: 06.11.2023

(1) ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము వారి ఆదేశముల ప్రకారము అల్లూరి సీతారామ రాజు జిల్లా నందు గల ఆర్ & ఆర్ కార్యాలయములు, రంపచోడవరం, ఎటపాక, చింతూరునందు తాత్కాలిక ప్రాతిపదికపై ఒకటి/రెండు సంవత్సరముల కాలపరిమితితో తేదీ.11.10.2024 వరకు ఈ దిగువ తెలిపిన ఔట్ సోర్సింగ్/రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగములకు నోటిఫికేషన్ జారీచేయడమైనది. కావున, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకొనవలసినదిగా కోరడమైనది.

వ. నెం.	పోస్ట్ వివరములు	అల్లూరి సీతారామరాజు జిల్లా: ఖాళీల సంఖ్య	రోస్టరు పాయింట్	వయస్సు	వేతనము	విద్యా అర్హత/ అనుభవము	రిమార్కులు
1	రిటైర్డ్ తహశీల్దార్/ డిప్యూటీ తహశీల్దార్	2	-	-	G.O.M.s.No. 48 Finance (HR.V) Dept. Dt.23.04.2018	రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నందు తహశీల్దార్/ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు చేసి రిటైర్డ్ అయిన ప్రభుత్వ పెన్షన్ దారులు (భూసేకరణ & ఆర్ & ఆర్ నందు పనిచేసిన అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును)	ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నందు పని చేసిన వారు మాత్రమే అర్హులు
2	రిటైర్డ్ సివిల్ ఇంజనీర్	2	-	-	G.O.M.s.No.48 Finance(HR.V) Dept, Dt.23.04.2018	భవన నిర్మాణము & మౌలిక సదుపాయముల కల్పనలో అనుభవము మరియు ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖలో రిటైర్డ్ సివిల్ ఇంజనీర్ గా పనిచేసి రిటైర్డ్ అయిన ప్రభుత్వ పెన్షన్ దారులు	ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నందు పని చేసిన వారు మాత్రమే అర్హులు
3	వర్క్ ఇన్‌స్పెక్టర్	1	BC-A(W)	18-42	As per G.O.M.S.No.7 Finance (HR.I &Plg. & Policy) Department, Dt.17.01.2022	డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్	ASR జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులు
4	డేటా ఎంట్రీ ఆపరేటర్	1	BC-E(W)			ఏదైనా డిగ్రీ మరియు Diploma in MS Office Word or PG Diploma	
మొత్తము ఖాళీలు		6					

కావున, అర్హులైన అభ్యర్థులు గెజిటెడ్ అధికారి వారితో అటెస్టెడ్ చేయబడిన విద్యా అర్హత, ఎస్ఎస్‌సీ ధృవపత్రములు, కుల ధృవీకరణ ధృవపత్రము, నివాస ధ్రువపత్రము, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను జత చేసి తమ దరఖాస్తులను తేది:16.11.2023 సాయంత్రం 5.00 గం.ల లోపు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, సి.ఆర్.పి. గెస్ట్ హౌస్, ధవళేశ్వరం గ్రామం, రాజమహేంద్రవరం రూరల్, పిన్ కోడ్-533125 నందు స్వయముగా అందచేయవలెను.

గమనిక : (1) అభ్యర్థులను వ్రాత పరీక్ష/మెరిట్/ఇంటర్వ్యూ ఆధారముగా ఎంపిక చేయబడును. (2) దరఖాస్తునకు తగిన అర్హత ధ్రువపత్రములు జతచేయని యెడల అట్టి దరఖాస్తులను తిరస్కరించబడును మరియు ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. (3) పై తెలిపిన ఖాళీల సంఖ్య తాత్కాలికమైనవి మరియు డిపార్ట్‌మెంట్ అవసరాన్ని బట్టి పెంచడానికి లేదా తగ్గించడానికి అవకాశం ఉంది.

ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ & ఎక్స్ అఫీషియో జాయింటు కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం.

యూత్ ఎక్స్ఛేంజ్ డ్యాన్స్ ప్రోగ్రాంలో అరకులోయ విద్యార్థుల ప్రతిభ


డ్యాన్స్‌లో ప్రథమస్థానం పొందిన విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు యూత్ ఎక్స్ఛేంజ్ డ్యాన్స్ ప్రోగ్రాంలో ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్.రామకృష్ణ తెలిపారు. గతనెల నెల 27వ తేదీ నుంచి ఈ నెల 2వ తేదీ వరకు ముంబైలో జరిగిన 15వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో 13 మంది యువతీయువకులు పాల్గొని థింసా నృత్యం ప్రదర్శించి, ప్రథమ స్థానం పొందారని చెప్పారు. వారిని ఎన్ఎస్ఎస్ పీవోలు నాగరాజు, వై.విజయలక్ష్మి, ఎం.అనితా కుమారి, వైస్ ప్రిన్స్‌పాళ్లు పుష్పరాజ్, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ మహేశ్వరరావు అభినందించారు.

అలరించిన సాంస్కృతిక పోటీలు



గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శన

రాంబిల్లి : ఎంఎస్ఎంఈ కేంద్రంలో నాలుగు రాష్ట్రాల గిరిజన యువత శిక్షణ సోమవారం కొనసాగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బీహార్, మహారాష్ట్ర, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన గిరిజన యువతీయువకులకు ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. గిరిజన యువత ఎంతో సంప్రదాయబద్ధంగా చేసిన నృత్య ప్రదర్శనలు ఆద్యంతం కట్టిపడేశాయి. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం(విశాఖపట్నం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన యువ సమ్మేళనం కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన పోటీలు నిర్వహించామని, ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 8న శిక్షణ ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామని జిల్లా యువ అధికారి జి. మహేశ్వరరావు తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


శ్రీనుకు రుణం నగదు అందజేస్తున్న అధికారులు

అరకులోయటౌన్: అర్హులందరికీ రుణాలు మంజూరు చేస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చిన్నమొత్తాల పొదుపు సంఘం బ్రాంచ్ మేనేజర్ మొష్యా ప్రసన్నకుమారి తెలిపారు. సోమవారం పలువురికి రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఐదుగురు సభ్యులు గ్రూపుగా ఏర్పడితే తక్కువ వడ్డీతో చిన్న మొత్తాల పొదుపు సంఘంలో రుణాలు అందజేస్తామన్నారు. ఓ పొదుపు సంఘం గరిష్ఠంగా రూ. 5 లక్షలు రుణం పొందవచ్చాన్నారు. అరకు సంతబయలుకు చెందిన కె.శ్రీను అనే చిరు వ్యాపారికి రూ. 2 లక్షలు రుణం అందజేశామని తెలిపారు.

అర్ధరాత్రి బైక్ దగ్ధం

పోలీసులకు ఫిర్యాదు


పూర్తిగా దగ్ధమైన బైక్

రావికమతం: గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ద్విచక్ర వాహనం ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. రావికమతం గ్రామానికి చెందిన కొశిరెడ్డి శ్రీను బైక్‌ను ఎప్పటి మాదిరిగా ఇంటి ముందు పార్క్ చేసి ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో కాలిపోతూ శబ్దం రావడంతో బయటికి వచ్చి చూశాడు. వెంటనే మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోయాడు. తనపై గిట్టని వారు ఈ దారుణానికి పాల్పడ్డారని సోమవారం రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న కారు స్వాధీనం

మాడుగుల రూరల్: కోనాం అవతలి వైపు నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న కారును కోనాం చెక్ పోస్టు సమీపంలో గుంటి కొత్తూరు వద్ద పోలీసులు పట్టుకున్నారు. సోమవారం గుడివాడ మీదుగా గంజాయిని కారులో తరలిస్తుండగా, కోనాం చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోవిందరావు కారు తనిఖీ చేసేందుకు నిలపాల్సిందిగా సిగ్నల్ ఇచ్చారు. అయితే కారు అతివేగంగా నడిపించి తప్పించుకొనేందుకు నిందితులు ప్రయత్నించారు. దీంతో హెడ్ కానిస్టేబుల్, చెక్‌పోస్టు సిబ్బంది వెంటపడగా కారును గుంటి కొత్తూరు వంతెన వద్ద విడిచిపెట్టి, నిందితులు పరారయ్యారు. ఈ సమాచారాన్ని చీడికాడ ఎస్ఐకు నివేదించారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని కారును సీజ్ చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

పర్యాటకులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి



కాంట్రాక్ట్ ఉద్యోగులతో పాడేరు ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల: పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్ ఆదేశించారు. జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతాన్ని సోమవారం ఆయన సందర్శించి, కొత్తపల్లి గ్రామంలోని గిరిజనులు, జలపాత నిర్వాహకులైన ఐటీడీఏ కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిస్టు సీజన్‌లో కొత్తపల్లి జలపాతానికి వచ్చే పర్యాటకులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా గ్రామస్తులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, వారు తిరిగి ప్రయాణమయ్యేవరకూ రక్షణగా నిలవాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీఐ సత్యనారాయణ సొంత సొమ్ముతో కొనుగోలు చేసిన యూనిఫారాలను 22 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏఎస్పీ అందజేశారు. యూనిఫారాలు అందజేసిన ఏఎస్పీ, సీఐలకు కొత్తపల్లి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్, కొత్తపల్లి వాటర్ ఫాల్స్ మేనేజర్ నవీన్‌కుమార్, సూపర్‌వైజర్ వంతాల అభి తదితరులు పాల్గొన్నారు.

బిర్సాముండా జయంతి ఉత్సవాలకు ఆహ్వానం


పీవో కావూరి చైతన్యకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి

చింతూరు: ఆదివాసీ సమరయోధుడు బిర్సాముండా జయంతి ఉత్సవాలకు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యను ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి ఆహ్వానించారు. సోమవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయన పీవోను కలిశారు. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న మండలంలోని పేగలో బిర్సాముండా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కారం కన్నారావు, విప్లవ్‌కుమార్, లచ్చుదొర, మహేష్, కమిటీ సభ్యుడు తోడెం ముదిరాజ్ పాల్గొన్నారు.

టిక్రపడలో తాత్కాలిక పాఠశాల ప్రారంభం


టిక్రపడలో తాత్కాలిక పాఠశాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ నోయిన

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ టిక్రపడ గ్రామ విద్యార్థులకు పాఠశాల సమస్య తీరింది. గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కడుతుల గ్రామంలో పాఠశాలకు 20 మంది విద్యార్థులు ప్రతి రోజు కాలినడకన వెళ్లిరావలసి వస్తోంది. టిక్రపడ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని చాలా ఏళ్ల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. స్పందన కార్యక్రమంలో ఈ సమస్యను స్థానిక నేతలు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్పందించిన ఆయన తాత్కాలిక పాఠశాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పాఠశాలను సోమవారం స్థానిక సర్పంచ్ జనం నోయిన, మండల వైఎస్సార్‌సీపీ నేత తిరుపతి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామంలో అద్దె భవనంలో విద్యార్థులకు తరగతులు జరుగుతాయని సీఆర్‌టీ హరి తెలిపారు.

వైఎస్సార్‌సీపీకే ఓటు అడిగే హక్కు


వెలగలపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు

కొయ్యూరు: రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం మండలంలోని వెలగలపాలెంలో పార్టీ శ్రేణులు, నేతలు, అభిమానుల మధ్య ఆమె కేక్ కట్ చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి అధికారం చేపడుతుందన్నారు. ప్రజలకు ఇప్పటికే తమ పార్టీ ఓటు వేయాలన్న నిశ్చయంతో ఉన్నారన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పలన వెంకటరమణ, అంబటి నూకాలు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సచివాలయ మండల కన్వీనర్ బండి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, ఎంపీటీసీ అప్పారావు, సర్పంచ్‌లు రావుల వెంకటలక్ష్మి, పొట్టిక భవాని, రీముల శ్రీను, కోడా రాజుబాబు, రాజకుమారి పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.